

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం నుండి 1,10,568 క్యూసెక్కుల నీరు దిగువకు



పోలవరం వద్ద గోదావరి పరవళ్లు

పోలవరం: ఎగువ రాష్ట్రాల్లో, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,10,568 క్యూసెక్కుల జలాలను స్పిల్వే 48 గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. స్పిల్వే ఎగువన 27.200 మీటర్లు, స్పిల్వే దిగువన 17.250 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 27.300 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 16.310 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.890 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల గుబులు..!

స్మార్ట్ మీటర్ల బిగింపులో విద్యుత్ శాఖాధికారుల ప్రమేయం నిల్

జిల్లాలో 200 మందితో కూడిన అదానీ బృందాలు

ఇప్పటి వరకూ పశ్చిమలో 45 వేలు, ఏలూరు జిల్లాలో 33 వేల మీటర్ల బిగింపు

2026 సెప్టెంబర్‌కు మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలని టార్గెట్

బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని వినియోగదారుల గగ్గోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్మార్ట్ మీటర్ల బిగింపుతో జిల్లా ప్రజానీకంలో గుబులు నెలకొంది. ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో వాణిజ్య దుకాణాలకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఇటీవల దాన్ని మరింత వేగవంతం చేసింది. కూటమి ప్రభుత్వం విద్యుత్‌శాఖను పూర్తిగా అదానీ కంపెనీకి తాకట్టు పెట్టేసిందనే విమర్శలు వినిప్పిస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపులో జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారుల జోక్యం లేకుండా పక్కనపెట్టేసింది. అదానీ నియమించిన 200 మందితో కూడిన బృందాలే స్మార్ట్‌మీటర్ల బిగింపు వ్యవహారం సాగిస్తోంది. రెండు జిల్లాల్లోనూ స్మార్ట్ మీటర్ల బిగింపుపై విద్యుత్ శాఖాధికారులకు కనీస సమాచారం లేకుండా పోయిందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. స్మార్ట్ మీటర్ల బిగింపు ముందుగా కమర్షియల్, అధికంగా విద్యుత్ వినియోగించేవారికి బిగించాలని పైనుంచి ఆదేశాలు వచ్చినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల మూడు వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటిలో 4,58,435 గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. మిగిలినవి కమర్షియల్, పరిశ్రమలు, వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో మొదటి విడతగా కమిర్షియల్, అధిక వినియోగం చేసే మొత్తం 1,33,155 విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకూ 33,750 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించారు. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు ఆరు లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తొలివిడతగా 2.10 లక్షల కమర్షియల్, అధిక విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు బిగించేలా ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకూ 45,762 విద్యుత్ సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల బిగింపు పూర్తయ్యింది. ప్రతిరోజూ నిరంతరాయంగా ప్రక్రియ సాగుతోంది. 2026 సెప్టెంబర్ నాటికి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తిచేసేలా ముందుకు సాగుతున్నారు. కమర్షియల్ పూర్తయ్యాక గృహవినియోగ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేలా ప్రణాళికను రూపొందించినట్లు తెలుస్తోంది.

బిల్లులు అదనంగా వస్తున్నాయంటూ గగ్గోలు

స్మార్ట్ మీటర్ల బిగింపు తర్వాత విద్యుత్ బిల్లులు అదనంగా వస్తున్నాయంటూ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పట్టణాల్లో ఆస్తి పన్ను విపరీతంగా పెంచేసిన ప్రభుత్వం, ఇప్పుడు స్మార్ట్‌మీటర్ల బిగింపుతో అదనపు భారాలను మోపిందంటూ పట్టణ ప్రజలు నెత్తినోరు బాదుకుంటున్నారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మార్చేలా రూపొందించారు. దీంతో ప్రజల్లో స్మార్ట్ మీటర్లపై తీవ్ర ఆందోళన నెలకొంది. స్మార్ట్ మీటర్లకు సంబంధించి విద్యుత్‌శాఖాధికారులు ఎటువంటి సమాధానం చెప్పలేకపోతున్నారు. వివరాలు కావాలంటే అదానీ టీమ్ సభ్యులను అడిగి తెలుసుకోవాలని అధికారులే చెబుతుండటం గమనార్హం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో మీటర్ల బిగింపు వేగంగా సాగడం లేదని తెలుస్తోంది. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు మరింత బలపడితేనే వాటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

అర్జీలు పారదర్శకంగా పరిష్కరించాలి


కలెక్టర్ కె.వెట్రిసెల్వి



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు అక్కడే పరిష్కార మార్గాలు చూపించి, అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఎస్‌డిసి కె.భాస్కర్ పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న నిర్వాసితులు, నేతలు

41వ కాంటూర్‌లో కలిపి న్యాయం చేయండి

అఖిలపక్షం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తొలుత అంబేద్కర్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి నేతలు మాట్లాడారు. ముంపు గ్రామాల సర్వే చేసినప్పుడు అవకతవకలుగా చేశారని, గోదావరి వరద భద్రాచలం వద్ద 40 అడుగులు వస్తే ముంపునకు గురవుతున్న సుద్దగుంపు, తాట్కూర్‌గొమ్ము కాలనీ, నడిమిగొమ్ము, ఎర్రబోరు, పాతపూచిరాల, మద్దిగట్ల, పడమటిమెట్ట, చాగరపల్లి, కొర్రాజులగూడెం, గీగావారి గుంపు తదితర పల్లపు గ్రామాలు 45 కాంటూరు పరిధిలో ఉన్నాయన్నారు. ఆ గ్రామాలను 41 కాంటూర్లో కలిపి వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. ప్రతియేటా గోదావరి వరదల వల్ల ఆయా గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఆ గ్రామాలు ప్రస్తుతం 45 కాంటూర్ పరిధిలో ఉన్నాయని, వెంటనే వాటిని మార్చాలని కోరారు. వరదల సమయంలో ఉండేందుకు చోటులేక, ఉపాధి లేక నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పునరావాసం కల్పించడంతోపాటు ప్యాకేజీ అందించాలని, మిగులు భూములను ప్రభుత్వం తీసుకొని నష్టపరిహారం రైతులకు అందించాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో గిరిజనులకు భూమికి భూమి ఇచ్చిన అనేకచోట్ల ఆ భూయజమానులతో గొడవలు జరుగుతున్నాయని, వాటిని సరి చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కోసం సర్వే చేపట్టిన 2017లో పెట్టిన కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో ఇళ్ల కేటాయింపునకు సరైన విధానం అమలు చేయాలని కోరారు. చల్లావారిగూడెం పునరావాస కాలనీలో వేలాది మంది ఉన్నందున ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్మల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎమ్‌డి.మునీర్, మండల కార్యదర్శి బాడిస రాము, కారం దారయ్య, కాంగ్రెస్ నాయకులు కొల్లూరి సత్యనారాయణ, ఇబ్రహీం, సమ్మయ్య, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు సిరికొండ రామారావు, కరాటం ముత్యాలరావు, జిఎస్‌పి నాయకులు బంధం ప్రసాద్, ఊకే ముత్యాలు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ షరతులు తొలగించాలి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల వద్ద అంగన్వాడీల ధర్నా




ఏలూరులో నినదిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.షమీమా, రజని మాట్లాడుతూ 2022లో ఇచ్చిన సెల్‌ఫోన్లలో యాప్‌లు పని చేయడం లేదన్నారు. యాప్‌ల్లో వివరాలు అప్‌లోడ్ చేయకపోతే సరుకులు ఇవ్వబోమని చెప్పడం సమంజసం కాదన్నారు. మారుమూల ప్రాంతాల్లో నేటికీ సిగ్నల్స్ అందక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.హైమావతి, టి.అరుణ, డి.అన్నపూర్ణ, ఆర్.రామలక్ష్మి, కె.రేణుక, పి.సుకన్య, ఝాన్సీ, సిఐటియు నాయకులు ఎం.ఇస్సాక్, పంపన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అంగన్వాడీలు సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేస్తామని చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. ఆచరణలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసి, రిజిస్టర్ చేయకపోతే సరుకులు ఇవ్వబోమని బెదిరించడం తగదన్నారు. ఫలితంగా భవిష్యత్తులో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల సంఖ్య, ముఖ్యంగా పిల్లలు తగ్గిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. గతంలో వలె లబ్ధిదారుల సంతకాలతో సరుకులు పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు శివ రత్నకుమారి, పిఎల్ఎస్.కుమారి, నాగవేణి, సత్యవేణి, ధనలక్ష్మి, సీత, శ్రీదేవి పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: వినతి అందిస్తున్న అంగన్వాడీలు

చింతలపూడి: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు ఎన్.సరోజిని, నాయకులు టి.మాణిక్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం అందించడం మాని, పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్ తీసుకొచ్చి అంగన్వాడీ కేంద్రాలకు దూరం చేసే విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. పనిచేయని ఫోన్లు తీసుకుని కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పాండు రంగారావు మాట్లాడారు. అనంతరం ఇన్‌ఛార్జి సిడిపిఒకు వినతిపత్రం అందించారు. ధర్నాకు యూనియన్ నేతలు జి.సరళాదేవి, ఫణి వర్ధిని, వి.ఈశ్వరి, ఎం.అరుణ, ఎం.సత్యవతి, కె.కవిత, పాపారత్నం, చెన్నకేశ్వరి, శ్యామల, మార్తమ్మ, మేరీ కుమారి, ఎ.అరుణ కుమారి, హేమలత, బాబి నాయకత్వం వహించారు.



చింతలపూడి: వినతి అందిస్తున్న అంగన్వాడీలు

భారీ వర్షం.. రైతులు హర్షం



ముదినేపల్లి: నీటితో కళకళలాడుతున్న వరి చేలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అమీనాపేట, అశోక్‌నగర్, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, పత్తేబాద్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిండి మురుగునీరు రోడ్లపైకి చేరింది. అవసరాల నిమిత్తం మార్కెట్‌కు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా పండ్ల వ్యాపారం దెబ్బతిందని తోపుడు బండ్ల వ్యాపారులు వాపోయారు. పవర్‌పేట స్టేషన్ రోడ్డు, ఆర్ఆర్‌పేట, గవర్నమెంట్ హాస్పిటల్ ముందు రోడ్లు జలమయమయ్యాయి.



ఏలూరు: వర్షంతో రైతుబజార్‌లో ఇబ్బంది పడుతున్న జనం

మండవల్లి: అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి మండలంలో విస్తారంగా వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 33.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ముదినేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో చేలు వర్షపు నీటితో నిండాయి. 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో నాట్లు వేసిన పొలాలు, వెదజల్లిన చేలు, నారుమళ్లు ఎండిపోయాయి. చాలా గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై నీరు నిలవడంతో అవస్థలు


ముసునూరు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. పలురోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పలు గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుంది. శుక్రవారం కురిసిన వర్షానికి చెక్కపల్లి రోడ్డు జలమయం కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ముసునూరు : జలమయమైన చెక్కపల్లి ప్రధాన రహదారి

మోడీ పాలనలో తగ్గిన ఉపాధి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాల్లో ప్రపంచీకరణ విధానాలను వేగవంతం చేసిన ఫలితంగా ఉపాధి అవకాశాలు తగ్గాయని, వ్యవసాయ రంగం కుదేలై రైతుల ఆత్మహత్యలు పెరిగాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ హాలులో రెండు రోజులపాటు జరగనున్న సిపిఎం జిల్లా విస్తృత సమావేశం తొలిరోజు సోమవారం ఎం.నాగమణి అధ్యక్షతన ప్రారంభమైంది. ముఖ్యఅతిథి రాంభూపాల్ మాట్లాడుతూ అదానీ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకురాగా, నాడు జగన్, నేడు చంద్రబాబు ప్రభుత్వాలు వాటిని బిగిస్తూ ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి, అధికారంలోకొచ్చాక వాటిని రద్దు చేయడం మాని, బిగింపునకు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచీకరణ విధానాలు విఫలమైనట్లు అమెరికా చర్యలు చెప్పకనే చెబుతున్నాయన్నారు. ఆ విధానాల ఫలితంగా మన దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలైపోయాయని, ఉపాధి కనుమరుగైందని, ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. చైనా, రష్యాల నుండి ఆయిల్ దిగుమతులు చేసుకుంటే భారీ సుంకాలు విధిస్తానని అమెరికా హెచ్చరించి, మన దేశంపై పెత్తనం చేయడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికా పెత్తందారీ విధానాలను ఎదిరించాలని, మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ పామాయిల్, కోకో వంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, తెల్లం రామకృష్ణ, పిల్లి రామకృష్ణ, జి.రాజు, మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, నేతలు పి.నాగరాజు, మానుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు తొలుత ఇటీవల మరణించిన నేతలకు సమావేశం సంతాపం తెలిపింది.

నారుమళ్లు కుళ్లిపోయాయి..నీళ్లు ఆపండి

కలెక్టరేట్ వద్ద రావులపర్రు రైతుల ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పైనుండి వస్తున్న అధిక నీరు వల్ల తమ నారుమళ్లు మొత్తం కుళ్లిపోయి పంటలకు నష్టం వాటిల్లుతుందని, అధికారులు వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉంగుటూరు మండలం రావులపర్రు రైతులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు బోనాద్రి తాతారావు, ఎడవల్లి శ్రీను మాట్లాడుతూ తమ గ్రామంలోని 150 ఎకరాల్లో తామంతా వరి నారుమళ్లు పోశామని, ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరు తోకలపల్లి కాలువ ద్వారా కొల్లేరులో కలుస్తుందని తెలిపారు. అయితే రావులపర్రు రెగ్యులేటర్‌లో చెక్క బల్లలు ఏర్పాటు చేశారని, అక్కడ పని చేస్తున్న గుమ్మల నాగరాజు అధిక నీరొచ్చినా రెగ్యులేటర్ చెక్కబల్లలు ఎత్తకుండా పత్తేపురం, రాచూరు చేపల చెరువుల కోసం నీటిని పత్తేపురం కాలువలోకి విడుదల చేస్తున్నారని, దీనివల్ల తమ పొలాల్లోకి నీరు చేరి నారుమళ్లు కుళ్లిపోయాయని తెలిపారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, స్థానిక రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో చేపలు, రొయ్యల చెరువులకు ప్రాధాన్యత ఇస్తూ వరి సాగుదార్లను తీవ్ర నష్టాల పాల్జేస్తున్నారన్నారు. ఇరిగేషన్ జెఇ దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం లేదని, రాచూరుకు చెందిన నీటి సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరరెడ్డి తమకు ఫోన్ చేసి అధిక మొత్తంలో చేపలు, రొయ్యల చెరువులకు నీరు కావాలని, బల్లలు ఎత్తడం కుదరదని చెప్పారని, అంతేకాక తమపై దౌర్జన్యం చేస్తూ మీకు చేతనైనది చేసుకోండంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి తమకు న్యాయం చేయాలని కోరారు.

కాల్వను పరిశీలించిన అధికారులు

ఉంగుటూరు: రావులపర్రు బాడవ కింద నారుమడుల్లోకి పత్తేపురం పంట కాలువ నీరు చేరిందని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో అధికారులు సోమవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ ఎఇ సంధ్యారాణి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, రెవెన్యూ లస్కర్లు పంట కాల్వ, మురుగుబోదెలను పరిశీలించారు. అధిక నీరు దిగువకు వెళ్లాల్సిన మార్గాలను పరిశీలించారు. పలుచోట్ల ఆక్రమణల వల్ల బోదెలు మూసుకుపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సాధారణంగా నారుమడుల్లో నీరు నాలుగైదు రోజులపాటు నిల్వ ఉన్నా నారు కుళ్లిపోదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎఇ తెలిపారు. నీరు తగ్గగానే ఎరువులు వేస్తే నారు పెరుగుతుందని చెప్పారు.



ఉంగుటూరు: కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనే సందేశంతో కూడిన పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి పి.ధాత్రిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక గోదావరి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిఎం-ప్రణమ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించాయన్నారు. రైతులు జీవన, సేంద్రీయ ఎరువులను ఉపయోగించి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. నానో యూరియా, నానో డిఎపి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రపంచ జనాభా దినోత్సవం 2025 పోస్టర్లను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకర సమయం, అంతరం చాలా అవసరమని అన్నారు. కార్యక్రమంలో జెసి పి.ధాత్రిరెడ్డి, డిఎంహెచ్ఒ పిజె.అమృత, డిసిహెచ్ఎస్ పాల్‌సతీష్, ఎన్‌టిఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, ఎస్ఒ ఎన్.ఆనంద్‌కుమార్, ఎఎస్ఒ ఎం.కిషోర్ పాల్గొన్నారు.


యువత క్రీడలకు ప్రాధాన్యతివ్వాలి

రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి పి.ధాత్రిరెడ్డి సంయుక్తంగా అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించి జిల్లా పేరును నిలపాలన్నారు.

రైతులకు అండగా ఉంటా

గోపవరం సొసైటీ అధ్యక్షునిగా గణేష్ ప్రమాణస్వీకారం


ప్రజాశక్తి - ముసునూరు


ప్రమాణస్వీకారం చేసిన గణేష్

రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేలా చర్యలు చేపడతానని గోపవరం సొసైటీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్ అన్నారు. మండలంలోని గోపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సొసైటీ అధ్యక్షులుగా ఉప్పలపాటి గణేష్ సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సొసైటీ ద్వారా లాభం చేకూర్చేలా రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, బుజ్జియ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదగొన్నూరు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నాగరాజు

ప్రజాశక్తి - ముదినేపల్లి


ప్రమాణస్వీకారం చేసిన నాగరాజు

మండలంలోని పెద గొన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా గునుపూడి నాగ రాజు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా వీరమల్లు సుబ్బా రావు, కె.శ్యాంసుందరరావు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన చైర్మన్‌గా ప్రమాణం స్వీకారం చేసిన నాగరాజు, సభ్యులకు కూటమి నాయకులు, గ్రామ ప్రముఖులు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, బ్యాంకు ఖాతాదారులు, రైతులు, వెలమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి అర్హులకు ఎట్టి పరిస్థితుల్లో లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు. దెందులూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించి, సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతలపూడి : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఆర్‌కె ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్య క్రమం నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో అన్ని మండలాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి


నోటు పుస్తకాలు అందిస్తున్న హరికుమార్

శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన కీర్తిశేషులు సోమ పుష్పవతి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు సోమ సత్యనారాయణ (దాకారం సొసైటీ మాజీ చైర్మన్) సహకారంతో పేరూరులో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గొరిపర్తి నాగ సుబ్బారావు, టిడిపి పేరూరు గ్రామ అధ్యక్షులు జద్దు సత్యనారాయణ, సోమ ఈశ్వర సత్యనారాయణ, పుట్టి శివబాబ్జి, వీర్ల రంగబాబు, సోమ చింతయ్య, కామమూరి నాగబాబు, వీర్ల నాగబాబు, గుంటి మోహన్‌రావు, దొప్పు శ్రీను, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - ముసునూరు

లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన తానంకి రాంబాబు, అతని భార్య అనిత (30) తమ మేనల్లుడు నవీన్‌ను బైక్‌పై ఎక్కించుకుని సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం రమణక్కపేట వెళ్లారు. తిరిగి బైక్‌పై లోపూడి బయలుదేరారు. ఈ క్రమంలో అక్కిరెడ్డిగూడెం వద్దకు వచ్చేసరికి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అనిత అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబు, నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరిని స్థానికులు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి నాచుగుంట రేవు వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌పై వెళ్తున్న నాగరాజును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు అతడిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాచుగుంట గ్రామంలో నుంచి హైవే ఎక్కుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని బాదంపూడికి దారాబత్తుల భాను (23) చెడు వ్యసనాలకు బానిసై సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఉప సుబ్బారావు కూలి పనుల కోసం కృష్ణజిల్లా పామర్రు మండలం పురుషోత్తపట్నం గ్రామం వెళ్లాడు. అక్కడ అదివారం చనిపోవడంతో మృతదేహాన్ని బాదంపూడి తీసుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీన్ ఆఫ్ అఫెన్స్ చేబ్రోలు పోలీస్ స్టేషన్ సంబంధం లేదని జీరో ఎఫ్ఐఆర్ వేసి కేసును పామర్రు పోలీసులకు పంపించామని చేబ్రోలు పోలీసులు చెప్పారు. నాచుగుంట జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో నాగరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు.

పట్టపగలు చోరీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలోని సుందరయ్య కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన డి.నవీన్ కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ ఉంటాడు. అతని భార్య, తల్లి ఆదివారం వేరే ఊరు వెళ్లారు. నవీన్ వ్యాపారం నిమిత్తం సోమవారం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి బీరువాలో ఉన్న సొమ్ము, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.


నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెంలో నాటుసారా స్థావరంపై చింతలపూడి ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో దేశావత బాలాజీ నాయక్ వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆతనికి బెల్లం సరఫరా చేసిన చింతలపూడి గ్రామానికి చెందిన గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె బాట

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


నూజివీడు టౌన్ : సమ్మె చేపట్టిన మున్సిపల్ కార్మికులు


తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షురాలు ఎం.జయలక్ష్మి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమ్మె కాలంలో అంగీకరించిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కార్మికులందరికీ వర్తించేలా జిఒలు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఎనిమిదో రోజు కొనసాగింది. సోమవారం మోకాళ్ల నిల్చుని నిరసన తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎల్.రంగారావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడేళ్ల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమ న్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు అప్పారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

చింతలపూడి : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు అంగన్వాడీ, వ్యవసాయ కార్మిక సంఘం సంఘీభావం తెలిపాయి. చింతలపూడి మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.


చింతలపూడి : సమ్మె నోటీసు అందిస్తున్న సిఐటియు నేతలు

సిఐటియు మండలాధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు టి.మాణిక్యం, ఎన్.సరోజిని, జి.సరళ, బి.ఫణి, కవిత మాట్లాడుతూ జిఒ 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ ఎ.రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.నాగరాజు, టి.విజయరాజు, ఎం.సత్యం, కె.నాగరాజు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందించారు. సమస్యలు పరిష్కరించకపోతే నగర పంచాయతీలో సమ్మె చేయడానికి వెనకాడబోమని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నత్త వెంకటేశ్వర రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు తుర్లపాటి బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో టి.వల్లి, రాము, వంశీ, చిన్నయ్య, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నూజివీడు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా కౌన్సిల్ ఉంటుందని చెప్పారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొండలరావు పైడమ్మలతో మంత్రి పార్థసారధి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ చెప్పారు.

పేదల సొంతింటి కల సాకారానికి కృషి

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయనను సోమవారం ప్రజలు కలిసి వారి సమస్యలను వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత క్రమక్రమంగా జఠిలమైన సమస్యలన్నింటికీ పరిష్కార మార్గాలు సుగమం అవుతూ వచ్చాయన్నారు. ఇదేస్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పిహెచ్‌సి సిబ్బందిని నియమించాలని వినతి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌ను, సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది లేకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడంలేదన్నారు. ఆసుపత్రిలో ఫ్లోరింగ్ దెబ్బతిందని, భవనం బయటపక్క పగుళ్లు వచ్చి ఐరన్ బయటకు కనిపిస్తుందని, గోడలు కూడా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటుందని చెప్పారు. జిల్లా వైద్య అధికారులు స్పందించి వైద్యశాలలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, జి.శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని సీతంపేట, ఉండ్రాజవరం, దోసపాడు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను వివరిస్తూ కరపత్రాలను అందించారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


కేరళ మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ కురు వృద్ధుడు, సిపిఎం నాయకులు విఎస్.అచ్యుతానందన్ మృతి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మరణం కేరళ కమ్యూనిస్టు ఉద్యమానికి పూడ్చలేని లోటని తెలిపారు. అచ్యుతానందన్ మృతికి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

టిడిపి వెలగపాడు కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి వెలగపాడు గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. వీరభద్రవరం గ్రామంలోని ఆయన నివాసం వద్ద మండల పరిశీలకులు గుత్తా వెంకటేశ్వరరావు సమక్షంలో సోమవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా జోనుబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గుడిదల కృపావరం, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు నాగరాజు, కోశాధికారి మొగసాల ప్రభాకర్ ఎన్నికయ్యారు.


ఇళ్ల పట్టాల మంజూరు కోరుతూ ధర్నా


తహశీల్దార్ వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు

ఆగిరిపల్లి : పేదల ఆక్రమణలో ఉన్న ఇళ్లకు జిఒ 30 ప్రకారం ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని సిపిఎం మం డల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. నెక్కలం గొల్లగూడెం గ్రామంలోని సుందరయ్య నగర్ కాలనీ లో పేదల ఆక్రమణలో ఉన్న ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నేతలు, సుందరయ్య నగర్ కాలనీ వాసులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా శివనాగరాజు మాట్లాడుతూ గొల్ల గూడెం గ్రామంలో 2005లో సిపిఎం ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుని ఆ కాలనీకి సుందరయ్య నగర్ అని పేరు పెట్టుకుని, ఇంటిపన్ను, కరెంట్ బిల్లుల కట్టుకుంటున్నార న్నారు. ఏళ్ల గడుస్తున్నా సదరు ఇళ్లకు పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిఒ 30 ప్రకారం సుందరయ్య నగర్‌లోని పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆగిరిపల్లి టౌన్ కార్యదర్శి షేక్ జహంగీర్ భాషా, మండల కమిటీ సభ్యులు ముత్యాల నరేష్, జె.శామ్యూల్, కిరణ్ పాల్గొన్నారు.

మురుగు బోదె ఆక్రమణలపై సర్వే చేయాలి

రైతులతో సమీక్షా సమావేశంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తోకలపల్లి ప్రధాన మురుగు కాలువ చెక్క బల్లలు మూసేసి పత్తేపురం పంట కాలుకు నీరు వదలడంపై రావులపర్రు ఆయకట్టు రైతుల ఆవేదనపై ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు, నిడమర్రు మండలాలకు చెందిన పలు గ్రామాల సర్పంచులు, నీటి సంఘం ప్రతినిధులు, కూటమి నాయకులతో అభిప్రాయ సేకరణ చేశారు. తోకలపల్లి మురుగు కాలువ షట్టర్లు మూయడం వల్లే తమ పొలాలు మునిగి పోయాయని రావులపర్రు రైతులు అంటుండగా, చెక్క బల్లలు దించకపోతే నిడమర్రు మండలంలో పత్తేపురం, బైనేపల్లి, ఆముదాలపల్లి, తోకలపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి చెరువులకు నీరు ఎలా వస్తుందని నిడమర్రు మండల రైతులు, సర్పంచులు ప్రశ్నించారు. గత 40 రోజులుగా పత్తేపురం పంట కాలువలో నీరు లేక తాగునీటి చెరువులు ఎండిపోయాయన్నారు. దీంతో ఇరు రైతులు, గ్రామస్తుల సమస్య పరిష్కారం కోసం చేపట్టాల్సిన జాయింట్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాల్సిందిగా సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఎంఎల్‌ఎ ఆదేశించారు. రావులపర్రు, రాచూరులో మురుగు బోదెలు ఆక్రమణల్లో ఉండటం వల్లే అధిక నీరు దిగువకు వెళ్లక నారుమడుల్లో నీరు కొద్దిగా నిలిచిందని అధికారులు అంటున్నారు. దీనికి పరిష్కారంగా మురుగు కాలువలు, బోదెలపై ఆక్రమణలను సర్వే చేసి యుద్ధ ప్రాతిపదికన ఎన్‌క్రోచ్‌మెంట్స్ తొలగించాలని రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయిన్ల శాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ తోకలపల్లి మేజరు కాలువ, పత్తేపురం పంట కాలువలోకి నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా కాగుపాడు లాకుల వద్ద చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నీటి ప్రాంతాలే డెంగీ దోమలకు ఆవాసాలు

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మంచినీటి ప్రాంతాలే డెంగీ దోమలకు ఆవాసాలని, ప్రజలు ఇంటి లోపల, బయట వారానికోసారి, లేదా రెండు సార్లు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని లంబాడిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఏలూరులోని లంబాడిపేట కాలనీలో డెంగీ జ్వరాలపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ట్వింకిల్ మాట్లాడుతూ నీటి నిల్వ పాత్రలను కడిగి మూతలు పెట్టుకోవాలన్నారు. అప్పుడే దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులను తగ్గించుకోవచ్చని చెప్పారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు ఫ్రైడే డ్రైడే ఆచరించాలని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం లంబాడిపేట వీధిలో కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త వేమని, ల్యాబ్ టెక్నీషియన్ చిట్టిబాబు, ఆశా కార్యకర్తలు విజయ సుభాషిణి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ అన్నారు. చింతలపూడి జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై, మహిళలపై జరిగే అఘాయిత్యాల గురించి, సైబర్ నేరాల గురించి సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గాలం వేసే సంస్థలు ఎక్కువయ్యాయన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనల నమ్మి మోసపోవద్దన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేసినట్టు నమ్మించి ఖాతా, ఎటిఎం కార్డు నెంబర్, పిన్ నెంబర్ తీసుకుని ఖాతా నుంచి డబ్బు మాయం చేసే ముఠాలు ఉన్నారని, జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఫేస్‌బుక్ ద్వారా వేధింపుల బాధితులు ఇటీవల ఎక్కువయ్యారన్నారు. ఇద్దరు మధ్య స్నేహం తెగ దెంపులయ్యాక గతంలో దిగిన ఫొటోలు అమ్మాయిలకు శాపంగా మారుతున్నాయన్నారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టి.నరసాపురం : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఎం.జయబాబు సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, రోడ్డు భద్రత అంశాలపై ఎస్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఇంటర్నెట్, మోడరన్ కమ్యూనికేషన్ వేదికల వాడకంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ ఏజెన్సీలు నిబంధనలు పాటించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సంబంధిత ఏజెన్సీ వ్యక్తులు సక్రమంగా నిర్వహించాలని ఎంఇఒ ఎస్.జమలయ్య ఆదేశించారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు అతిక్రమిస్తే మిడ్డే మీల్ ఏజెన్సీ వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇటీవల కాలంలో నూజివీడు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న జెడ్‌పి బాలికల హైస్కూల్‌లో మిడ్డే మీల్ ఏజెన్సీ నిర్వహణలో కొనసాగుతున్న లోపాలపై అనేక ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఆ స్కూలులో మిడ్డే మీల్ ఏజెన్సీ మార్చేందుకు తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏజెన్సీలు నిబంధనలకు లోబడి పరిశుభ్రంగా పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. లేకుంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి

ముసునూరు : రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన సంవత్సర కాలం పూర్తి చేసుకున్నా ఎన్నికల హామీలను అమలు చేయనందుకు ప్రజలు నిలదీయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముసునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలం కార్యదర్శి వేముల బక్కయ్య నాయకత్వంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ రమణక్కపేటలో సాగు భూమలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి ఫారెస్ట్ కింద నమోదు కాని 420 ఎకరాలకు సత్వరం పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను 200 రోజులకు పొడిగించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవాని వెంకటేశ్వరరావు, నందిపాము రాణి, దారా బేబి శాలిని, ఆముదాల చినబాబు, ఆముదాల పరిశుద్ధం, ఆముదాల విజయలక్ష్మి, నందిపాము రాహేలు, ఎడ్లపల్లి పల్లి మాణిక్యం, ఆముదాల నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

4,248 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 4,248 క్యూసెక్కుల గోదావరి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇఇ యేసుబాబు తెలిపారు. కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాల్లో ఖరీఫ్ సాగు అవసరం మేరకు మాత్రమే నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీస్ కార్యాలయంలో 46 మంది ఫిర్యాదులను అందించారని, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

సురేష్‌కు ఎంఎల్‌ఎ అభినందన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కుంగ్ ఫు మాస్టారు గంధం సురేష్ నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినిమా నటుడు భానుచందర్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ సోమవారం అభినందించారు. తెలుగు యువత రాష్ట్ర నాయకులు శ్యామ్ సుందర్, టిడిపి పట్టణ సీనియర్ నాయకులు షేక్ ముస్తఫా, పట్టణ ప్రముఖులు, కుంగ్ ఫు విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

నేడు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సమావేశం ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు ఏలూరు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘం ఏలూరు నగర నాయకులు సొంటి శంకరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి హాజరవుతున్నారని, సంఘీయు లందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

వైసిపి అనుబంధ విభాగం జిల్లా కార్యదర్శిగా సీతారామయ్య

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన వెలవల సీతారామయ్యను వైసిపి అనుబంధ విభాగం జిల్లా కార్యదర్శిగా పార్టీ నాయకులు వెలవెల నాగేశ్వరరావు, మట్ట పుల్లారావు, సీనియర్ నాయకుల సమక్షంలో నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ మిట్టగూడెంలో ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతూ గ్రామంలో ఏ సమస్య వచ్చినా నేనున్నాను అనే భరోసా ఇచ్చే వ్యక్తిగా సీతారామయ్యకు మంచి పేరు ఉందన్నారు. వెలవెల సీతారామయ్య మాట్లాడుతూ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎల్లవేళలా నిలుపుకుంటాన ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ జి.కృష్ణంరాజు, నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్ రంగబాబు పాల్గొన్నారు.